పెనుభూతం

డాక్టర్ దగ్గర నుంచి ఇంటికి వచ్చాక అన్నాడు మురళి సరోజతో, 'నా కిష్టంలేదు' అని.

"ఏమిష్టంలేదు" అడిగింది సరోజ, మురళిని పట్టుకుని నడిపించుకువెడుతూ.

"అదే ఆ డాక్టర్ ఆపరేషన్ చేయాలన్నాడు కదా! నాకు ఆపరేషన్ చేయించుకోవటం యిష్టంలేదు" సరోజ భుజం మీద నుంచి చేతులు తీసి, మంచం మీద కూర్చుంటూ అన్నాడు మురళి.

పకపకా నవ్వింది సరోజ - "ఎవరూ యిష్టం వుండి సరదాగా ఆపరేషన్ చేయించుకోరు బుజ్జీ. అవసరమయితేనే చేయించుకుంటారు" అన్నది.

మురళి అన్నాడు - "నీకు నవ్వులాటగానే వుంటుంది. ఆపరేషన్ చేయించుకోవలసింది నేను కదా మరి!"

సరోజ నెమ్మదిగా అన్నది - "అది కాదండీ! మైనర్ ఆపరేషనే అన్నాడు కదా ఆయన. ఇందులో భయపడాల్సినదేముంది?"

"అన్నాడనుకో .... కాని ..." సణిగాడు మురళి.

రెండు రోజుల క్రితం నాంపల్లి దగ్గర, బాగా స్పీడుగా, స్టాప్‌లో ఆగకుండా ప్రగతిపథంలో పయనిస్తున్న ఆం.ప్ర.రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వారి సిటీ బస్సుని, పరుగెత్తుతూ అందుకోబోయి, అందుకోలేక ధామ్మని క్రింద పడ్డాడు మురళి. ఆ రోజు సాయంత్రానికల్లా కాలు వాచి, నొప్పి చేసింది.

ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని పరీక్షలూ చేసిన ఆర్థోపెడిక్స్ డాక్టర్ గారు - ఆపరేషన్ చేయాలని నిశ్చయించారు.

మురళి పడుకున్న మంచం ప్రక్కగా కుర్చీ లాక్కుని, అందులో కూర్చుని అన్నది సరోజ - "అసలింతకీ మీ అనుమానం ఏమిటో చెప్పండి?"

మురళి మాట్లాడలేదు.

"డాక్టర్ ఆపరేషన్ చేయించుకోవటం అవసరం అన్నాడు. రేపు వచ్చి హాస్పిటల్లో ఎడ్మిట్ కూడా అవమన్నాడు. మరి అలాటప్పుడు మీరు ఆపరేషన్ చేయించుకోనంటే ఎలా? జీవితాంతం కుంటుతానంటారా! ఈ నొప్పి అలానే భరిస్తానంటారా?"

"అది కాదు సరోజా... నాకు ఆపరేషనంటే యిష్టం లేదు."

"ఆపరేషన్ అంటే ఎవరికి మాత్రం యిష్టం వుంటుందండీ... ఏదో అవసరం వచ్చింది కాబట్టి చేయించుకోవాలి కానీ ...."

"ఊఁ ! ...ఊఁ!...ప్చ్....ప్చ్..." సణుగుతున్నాడు మురళి.

"అసలు ఏమిటి మీ భయం?"

"ఆపరేషనంటే నాకేం భయం లేదు సరోజా... కానీ ..."

అతను చిన్న పిల్లవాడిలా అలా అంటుంటే నవ్వు వచ్చింది సరోజకు.

"కానీ... చేసే డాక్టరంటే భయమా..."

ఒక క్షణం సూటిగా సరోజని చూసి అన్నాడు మురళి - 'ఒక విధంగా అంతే అనుకో!'

"ఆ డాక్టర్ పాపం ఎర్రగా బుర్రగా అందంగానే వున్నాడు..."

"అదికాదు సరోజా... నా మనసులోని మాట చెబుతాను విను ... కానీ మధ్యలో నవ్వకూడదు మరి..."

"ఊఁ! చెప్పండి మీ అనుమానాలేమిటి ?"

మురళి మాట్లాడకుండా ఆలోచిస్తున్నాడు. ఉన్నట్టుండి అన్నాడు - "పోనీ త్రివేండ్రం వెళ్లి అన్నయ్య వాళ్ల యింట్లో వుండి - ఆ వూళ్లోనే ఆపరేషన్ చేయించుకుంటే ..."

"ఏం ... ఆ మాత్రం డాక్టర్లూ, హాస్పిటల్సూ యిక్కడ లేవనా!" వింతగా చూసింది సరోజ.

"అలా అని కాదు - పోయినసారి అన్నయ్య ఇక్కడికి వచ్చినప్పుడు చెప్పాడు. అక్కడ హాస్పిటల్స్‌లో జనరల్ వార్డ్స్, మన పే వార్డ్సు కన్నా చాల నయమని, డాక్టర్లు కూడా పేషంట్స్‌ని పీడించుకు రక్తం తాగారనీ, పెద్ద పెద్ద డాక్టర్లు కూడా అందరికీ అందుబాటులో వుంటారనీ.."

"అంతేనా - ఆపరేషన్లు కూడా అక్కడ బాగా చేస్తారని చెప్పారా..." నవ్వింది సరోజ.

"అదికాదు సరోజా! వదినకి అక్కడ సీజేరియన్ చేసినప్పుడూ, తరువాత వాళ్ల పెద్దబ్బాయికి హెర్నియా ఆపరేషన్ చేసినప్పుడూ అన్నయ్య దగ్గరే వున్నాడు కదా. మన హాస్పిటల్స్‌కీ, డాక్టర్స్‌కీ - అక్కడి హాస్పిటల్స్‌కీ, డాక్టర్స్‌కీ చాలా తేడా వుందని అన్నాడు."

" అయితే అవచ్చు కానీ - ఇక్కడ కూడా పేరుపడ్డ డాక్టర్లు చాలా మంది వున్నారు. కాకపోతే వీళ్లకి కొంచెం ఆకలెక్కువ. ప్రభుత్వ ఆస్పత్రి అని పేరే అయినా, స్వంత హాస్పిటల్లో లాగా చార్జీలు వసూలు చేస్తారు. మన తాహతునిబట్టి ఆ మాత్రం యివ్వలేకపోము. అదీగాక త్రివేండ్రం కానీ, యింకోవూరు కానీ పోవాలంటే బోలెడు ఖర్చు. అదేదో ఈ డాక్టర్ మొహానే కొడితే, జాగ్రత్తగా చూసుకుంటాడు" అన్నది సరోజ.

"అవుననుకో...." నసిగాడు మురళి.

"ఇంతకన్నా కూడా మీ మనసులో ఏదో వుంది. ముందా విషయాన్ని బయటకు రానీయండి!" అడిగింది సరోజ.

"సరోజా! గుంటూరు, కాకినాడ, హైదరాబాద్, విశాఖపట్నం ఆసుపత్రులలో జరిగిన ఘోరాలు చాలా చదివాను పేపర్లలో. అంతేగాక ఈ డాక్టర్ల ప్రయోజకత్వం గురించి కూడా

చాలా విన్నాను. అదే నా భయం. ఆ కేసులు తలుచుకుంటేనే ఒళ్లు గగుర్పాటు చెందుతుంది..." ఆగాడు.

సరోజ మాట్లాడలేదు. మురళినే చూస్తూ కూర్చున్నది.

సన్నగా నవ్వాడు మురళి - "నా విషయంలో కూడా అలానే జరుగుతుందని నేను అనను. కానీ జరిగిన కేసులు ఎంత ఘోరంగా ఉన్నాయో చూశావా.. మొన్న ఈ వూళ్లోనే ఒక మూడేళ్ల చిన్న పిల్లకు, ఒక కన్ను క్యాన్సర్ వల్ల దెబ్బతింటే, ఆ కన్ను తీయబోయి రెండో కన్ను తీసివేశారుట. ఇప్పుడా అమ్మాయి బ్రతకాలంటే, ఆ కాన్సర్ కన్ను కూడా తీసి వేయాల్సిందే. అంటే రెండు కళ్లూ లేని కబోది అవుతుందన్నమాట. డాక్టర్ల నిర్లక్ష్యం, ఒక నిండు జీవితంలో ఎంతటి చీకటిని నింపిందో చూశావా ? అలాగే కొన్నాళ్ల క్రితం యింకో హాస్పిటల్లో అప్పుడే పుట్టిన పసికందు, తల్లి మంచం పక్కన వున్న వుయ్యాలలో కన్పించలేదు. చివరకు అందరూ వెతగ్గా, బయట ఆవరణలో ఒక కుక్క ఆ పసికందుని తినడం కనపడిందట. ఉయ్యాలలోని పసికందుని, కుక్క ఎలా లోపలకు వచ్చి నోట కరుచుకుని, బయటకు పోయిందో, ఆ హాస్పిటల్లోని స్టాఫ్‌కే తెలియాలి..."

"అవును ... ఈ విషయాలు నేనూ విన్నాను. కానీ ఎప్పుడూ యిలా ఎందుకు జరుగుతాయి..."

"ఎప్పుడూ జరుగుతాయా లేదా అని కాదు మనం ఆలోచించాల్సింది. అప్పుడప్పుడు మాత్రం ఎందుకు జరగాలని. ఒక మనిషి ప్రాణానికి సంబంధించిన విషయంలో , నిర్లక్ష్యం అనేది ఎందుకు రావాలి అని - మన రాష్ట్రంలోనే యింకో ప్రభుత్వ ఆసుపత్రిలో ఏం జరిగిందో తెలుసా? ఒక రోగికి ఆపరేషన్ చేస్తున్నప్పుడు , ఆక్సిజన్ కావాల్సి వచ్చింది. మామూలుగా అయితే ఎప్పుడూ ఆక్సిజన్ సిలెండరు పక్కనే సిద్ధంగా వుండాలి. ఆ రోజు కూడా సిలెండర్ అయితే ఉంది కానీ, దాంట్లో ఆక్సిజన్ మాత్రం లేదు. హాస్పిటల్ అంతా వెదికినా,ఆక్సిజన్ దొరకలేదు.ఈలోగా ఆపరేషన్ టేబుల్ మీద వున్న పేషెంటు 'హరీ' అన్నాడు. ఒకరి నిర్లక్ష్యం, యింకొకరి ప్రాణాల్నెలా హరిస్తుందో చూశావా. ఇలాంటి కేసులు ఎన్నో చదివా పేపర్లలో ..."

"మరి అంత నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్న డాక్టర్లూ, తదితర స్టాఫూ, హాస్పటల్ సూపరింటిండెంట్స్ మీద ప్రభుత్వం ఏ చర్యా ఎందుకు తీసుకోవటం లేదు?"

అదోలా నవ్వాడు మురళి - "తీసుకుంటూనే వున్నాం అనే అంటుంటారు అధికారులు, అసెంబ్లీలోని పెద్ద మనుషులు . అదంతా యింకో తలనొప్పి వ్యవహారంలే..."

"ఇలాంటివి ప్రతి రాష్ట్రంలోనూ జరుగుతూనే వున్నాయి..." అన్నది సరోజ.

"కానీ మన రాష్ట్రంలో ఎక్కువగా వింటున్నాం ఇలాంటివి..." అంటూనే కాలు పట్టుకున్నాడు 'అబ్బా' అంటూ బాధతో మురళి.

డాక్టర్ యిచ్చిన అయింట్‌మెంటుని పైపైన నెమ్మదిగా మర్దన చేసింది సరోజ.

కాసేపటికి తేరుకున్నాడు మురళి. సరోజ కళ్లల్లోకి సూటిగా చూసి, "నిన్ను బాగా కష్ట పెడుతున్నాను సరోజా" అన్నాడు.

సరోజ అతన్ని లాలనగా చూసి, "ఇందులో కష్టపడిందేముంది" అన్నది.

సరోజను దగ్గరకు తీసుకున్నాడు మురళి.

మర్నాడు ప్రొద్దున లేచిన వెంటనే కిచెన్‌లో పని చేసుకుంటున్న సరోజను పిలిచాడు మురళి.

"సరోజా! రాత్రల్లా ఆలోచించాను. ఈవాళే హాస్పటల్లో చేరదాం. ఆపరేషన్ చేయించుకుంటాను. ఇవాళే చిక్కడపల్లికి ఫోన్ చేసి ప్రసాద్‌ని రమ్మను. ఆపరేషన్ పూర్తయి, నేను మామూలుగా అయ్యేదాకా మనకి తోడుగా వుంటాడు" అన్నాడు మురళి.

వింతగా చూసిందతన్ని సరోజ.

"మరి మీ అనుమానాలన్నీ తీరినట్టేనా? " అడిగింది.

సన్నగా నవ్వాడు మురళి - "ఆ విషయాలన్నీ పేపర్లలో చదివి వుండడంవల్లా, నలుగురి నోటా విని వుండటంవల్లా అనవసరంగా భయపడ్డాను. ప్రతి రోజు ఈ దేశంలో ఎన్నో రకాల ఆపరేషన్లు కొన్ని వేలు జరుగుతున్నాయి. వాటిల్లో అశ్రద్ధ కారణంగా ఫెయిలయ్యేవి చాలా తక్కువ. అలాటి మూడు నాలుగు కేసుల్ని చూసి భయపడటం శుద్ధ అవివేకం!" అన్నాడు మురళి.

"వెరీ గుడ్. అయితే ఒక క్షణం వుండండి. వేడివేడి కాఫీ యిస్తాను. " అంటూ లోపలికి వెళ్ళింది సరోజ.

ఆ రోజే మురళి ఆసుపత్రిలో స్పెషల్ వార్డులో ఎడ్మిట్ అయ్యాడు. ప్రసాద్ వచ్చి ప్రక్కనే సహాయంగా వున్నాడు. డాక్టర్ వచ్చి పరీక్ష చేసి 'రేపు ప్రొద్దున్నే ఆపరేషన్ చేద్దాం. నేను అన్నీ సిద్ధం చేయిస్తాను. మీరేమీ గాభరాపడనవసరం లేదు. యు విల్ వాక్ నార్మల్లీ ఆఫ్టర్ ది ఆపరేషన్. రేపొద్దున్నే వచ్చి చూస్తాను!" అని ఆయన వేరే పేషెంట్సుని చూడటం కోసం వెళ్ళిపోయాడు.

మరునాడు ఆపరేషన్ థియేటర్‌లోకి స్ట్రెచర్ మీద తీసుకువెడుతున్నప్పుడు అక్కడే కళ్ళ నీళ్లు పెట్టుకుని నుంచునివున్న సరోజను చూసి చిన్నగా నవ్వాడు మురళి. సరోజ దగ్గరకు వచ్చింది -

" నాకేం భయం లేదు సరోజా ! ఎందుకా కన్నీళ్లు - చిన్న ఆపరేషనే కదా!" అన్నాడు మురళి.

ప్రసాద్ అన్నాడు - "ఒక గంటలో ఆపరేషన్ అయిపోతుంది అక్కయ్యగారూ - ఈలోగా ఈ ప్రక్కనే కాంటీన్‌లోకి వెడదాం పదండి - కాఫీ త్రాగచ్చు" అంటూ సరోజను పక్కకు తీసుకెళ్లాడు.

ఆపరేషన్ థియేటర్లో , పైన వున్న పెద్ద లైట్లను చూస్తున్న మురళికి, ఒళ్లు వేడిగా వున్నట్టు అనిపించింది - అనెస్థీషియా , పూర్తి శరీరానికి ఇవ్వడంవలన , తర్వాత ఏం జరిగిందో కూడా తెలియలేదు అతనికి.

కళ్లు తెరచి చూసేసరికి , అతను రికవరీ రూంలో వున్నాడు. ప్రక్కన సరోజ, ప్రసాద్ నుంచుని వున్నారు. సరోజ ముందుకు వచ్చి, మురళి తల మీద చేయి వేసింది.

" సరోజా! " నీరసంగా అన్నాడు మురళి.

"ఏమండీ - ఎలా వుంది !" అడిగింది సరోజ.

"బాగానే వుంది - కానీ నీరసంగా వుంది!" అన్నాడు.

"కాసేపు కళ్లు మూసుకు పడుకోండి - హాయిగా వుంటుంది!" అన్నది సరోజ.

సన్నగా నవ్వాడు మురళి.

హఠాత్తుగా ఏదో గుర్తుకు వచ్చినట్టు, చేత్తో తన రెండు కాళ్లు తుడుముకున్నాడు.

ప్రసాద్ నవ్వాడు "మురళీ! ఒక కాలుకి బదులు యింకో కాలుకి ఆపరేషన్ చేశారేమో నని భయపడుతున్నారా... ఈ మధ్యనే ఎవరికో ఒక కాలు తీసేయబోయి రెండో కాలు తీసేశారుట..."

మురళి కూడా యిబ్బందిగా నవ్వాడు. "అదేం లేదు ప్రసాద్...."

సరోజ అన్నది "అలాటివేం జరగలేదు లెండి -- డాక్టర్ అన్నీ సక్రమంగా జరిగాయనీ, కుట్లు విప్పగానే యింటికి పంపిచేస్తాననీ చెప్పాడు. నడక కూడా మామూలుగా వస్తుందనీ, ఏ మాత్రం అనుమానం లేదనీ చెప్పారు!"

మురళి పైకి అనకపోయినా, అంతా సవ్యంగా జరిగినందుకు లోలోపల సంతోష పడ్డాడు. తను అనవసరంగా అనుమానపడి, గాభరాపడ్డందుకు కొంచెం సిగ్గు పడ్డాడు కూడా.

వారం రోజుల తర్వాత కుట్లు విప్పదీశారు. డాక్టర్ పరీక్షచేసి అంతా సవ్యంగానే వుందన్నాడు.

తర్వాత యింకో రెండు రోజులు వుండి, డాక్టర్‌కీ, నర్సులకీ, అనెస్థీషియన్‌కీ, వార్డ్ బోయిస్‌కీ, తోటీలకీ యివ్వవలసిన ముడుపులూ, మామూళ్లూ యిచ్చి, అంబులెన్స్‌లో యింటికి చేరాడు మురళి.

"సో -- ఇక నే వెడతాను. నా అవసరం వుంటే ఫోన్ చేయిండి. వస్తాను" అంటూ శెలవు తీసుకున్నాడు ప్రసాద్.

సరోజ గేటు దాకా వెళ్లి, అతన్ని ధన్యవాదాలతో పంపించి వచ్చింది.

"ఆపరేషన్ అయిన తర్వాత స్పృహ రాగానే ఎంత భయపడ్డానో తెలుసా! వాళ్లు ఏం ఆపరేషన్ చేశారో, ఎలా చేశారో అని... ఇలాంటి అనుమానాలు సైకలాజికల్‌గా బ్రెయిన్‌ని చాలా ప్రెషరైజ్ చేస్తాయి సరోజా... అసలు ఇటువంటి అనుమానాలు రానేకూడదు!" అన్నాడు మురళి.

"అందుకే అనుమానం 'పెనుభూతం' అన్నారు!" అన్నది సరోజ.

తర్వాత నాలుగు రోజులు బాగానే గడిచాయి. అయిదో రోజున నిద్ర లేస్తూనే, ఆపరేషన్ చేసిన తొడ దగ్గర పట్టుకుని - "ఇక్కడెందుకో బాగా నొప్పి వుంది సరోజా" అన్నాడు మురళి.

డాక్టర్ ముందే యిచ్చిన టాబ్‌లెట్స్ వేసింది సరోజ. కాసేపు వూరుకుని, మళ్లా నొప్పి వచ్చిందనీ, యింకా ఎక్కువగా వుందనీ అన్నాడు మురళి.

"హాస్పిటల్‌కి వెడదామా!" అడిగింది సరోజ.

"ఊఁ!" అన్నాడు బాధగా మురళి.

ఫోన్ కాల్ అందగానే, అరగంటలో టాక్సీతో సహా వచ్చాడు ప్రసాద్.

వెంటనే మురళిని హాస్పిటల్‌కి తీసుకు వెళ్లాడు.

డాక్టర్ మురళి ఒక ఇంజెక్షన్ చేసి అక్కడే బెడ్ మీద పడుకోబెట్టాడు.

ఎంతసేపటికీ నొప్పి తగ్గలేదు సరికదా, యింకా ఎక్కువ అవసాగింది. ఆ డాక్టర్ వెళ్లి, యింకో డాక్టర్ను కూడా పిలుచుకు వచ్చాడు. అతను కూడా పరీక్ష చేసి, ఆపరేషన్ చేసిన ప్రదేశాన్ని ఎక్సరే తీయించాడు. తర్వాత ఇద్దరూ ఎక్స్‌రే పట్టుకుని ప్రక్క రూమ్‌లోకి వెళ్లి, ఒక పావుగంట తర్వాత బయటకు వచ్చారు.

బయట ఆత్రంగా నుంచునివున్న ప్రసాద్, సరోజలను చూసి - "మీరు యిక్కడే వుండండి. ఒక చిన్న ఆపరేషన్ చేస్తే, అంతా బాగవుతుంది - దేరీజ్ నో ప్రాబ్లం!" అంటూ మురళిని వెంటనే ఆపరేషన్ థియేటర్‌లోకి తరలించారు.

"అసలు ఏమయింది డాక్టర్?" వెంటబడి అడుగుతున్న ప్రసాద్‌కి ఎవరూ జవాబివ్వలేదు.

ఆపరేషన్ థియేటర్ తలుపు మూసుకుంది. ఏమీ అర్థంకాక అయోమయంగా చూస్తున్న సరోజతో అన్నాడు ప్రసాద్ - "మీరేమీ గాభరా పడకండి -ఎవ్విరిథింగ్ విల్ బి ఆల్‌రైట్!" అని.

ఒక పావుగంట తర్వాత, ఒక నర్సు బయటకు వచ్చింది. యింకో నర్స్‌ని పిలచి ఒక చీటీ అందించి "వెంటనే రావాలి సుమా!" అన్నది.

ఆ నర్స్‌ని సమీపించి "మురళి ఎలా వున్నాడు - అసలేం జరిగింది!" అడిగాడు ప్రసాద్.

ఆమె ఏమీ మాట్లాడలేదు.

మళ్లీ మళ్లీ అడిగాడు ప్రసాద్.

చివరకు ఆమె నెమ్మదిగా అన్నది - "మీరేమీ కంగారు పడకండి - పోయినసారి ఆపరేషన్ చేసినప్పుడు పొరపాటున ఫోర్‌సెప్స్ లోపలే వుంచి కుట్టివేయటం జరిగింది. ఇందాక ఎక్సరే తీసినప్పుడు ఆ విషయం బయటపడింది. వెంటనే ఆపరేషన్ చేసి అది తీసివేయటానికి ప్రయత్నం చేస్తున్నాం. ఈలోగా బ్లడ్ ఎక్కించాల్సిన అవసరం వచ్చింది. బ్లడ్ కోసం సిస్టర్ వెళ్లింది కూడాను..."

తర్వాత ఆమె చెప్పేదేది సరోజ చెవిన పడలేదు. ఒళ్లంతా చెమటలు పట్టి, స్పృహ తప్పి అక్కడే పడిపోయింది.

స్పృహ వచ్చాక, సరోజ కళ్లు తెరచి చుట్టూ చూసింది. తను మంచం మీద పడుకుని వున్నది. పైన ఫ్యాన్ గిరగిరా తిరుగుతున్నది. పక్కనే సపర్యలు చేస్తున్నది నర్స్.

పక్కకు తిరిగి చూసింది సరోజ.

ప్రసాద్ ముఖం చేతుల్లో దాచుకుని ఏడుస్తున్నాడు.

"ఏమయింది... ఆయనకెలా వుంది.... ఆయన...." నీరసంగా అడిగింది సరోజ.

"ఇంకెక్కడి మురళి... ఆపరేషన్ టేబుల్ మీదే మనందర్నీ వదలిపోయాడు వాడు... వాడి అనుమానమే యిప్పుడు నిజం అయింది..." బావురుమన్నాడు ప్రసాద్.

సరోజకి మళ్లీ స్పృహ తప్పింది.